క్లుప్తంగా

ప్రైవేటుకు దీటుగా సర్కారు విద్య

ఎంపీపీ పద్మారెడ్డి



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న పద్మారెడ్డి, ఏంఈఓ

మాడ్గుల: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంపీపీ పద్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవంతో కూడిన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యాబోధన బోధిస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందిస్తున్నారని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొవద్దని సూచించారు. పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తే అద్భుత విజయాలు వరిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఏంఈఓ సర్దార్ నాయక్, ఎంపీడీఓ పద్మావతి, నోడల్ అధికారి పర్వతాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న నాయకులు

తలకొండపల్లి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరిపారు. శనివారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. నాయకుల జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మొక్కలను విరివిగా నాటాలన్నారు. మొక్కల పెంపకంతో సకాలంలో వర్షాలు కురిసి వ్యవసాయ రంగం గణనీయంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. తద్వారా అన్నపూర్ణ దేశంగా భారత దేశం కీర్తి గడించనుందని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, ఆరీఫ్, శ్రీను, శేఖర్, అజీం, యాదగిరి, నరసింహ, రమేశ్ పాల్గొన్నారు.

డిజిటల్ బ్యాంకింగ్ సేవలతో లబ్ధి

ఆమనగల్లు: డిజిటల్ బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంక్ ఆమనగల్లు శాఖ మేనేజర్ జగన్మోహన్ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లి గ్రామంలో శనివారం ఏపీజీవీబీ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ జగన్మోహన్, ఫీల్డ్ ఆఫీసర్ పండరినాథ్, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, ఇన్సూరెన్స్, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. అనంతరం మేనేజర్ జగన్మోహన్ మాట్లాడుతూ.. ప్రతి ఖాతాదారులు డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, మొబైల్ బ్యాంకింగ్, నెట్‌బ్యాంకింగ్, కేవైసీ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఖాతాదారులు సైబర్ మోసాలకు గురికావద్దని సూచించారు. బ్యాంకు ద్వారా జీవితబీమా, ఆరోగ్యబీమా, వ్యక్తిగత ప్రమాదబీమా సౌకర్య కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాటి చెట్లను తొలగించకుండా చర్యలు తీసుకోండి



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం: పొల్కంపల్లి గ్రామపరిధిలోని తాటి చెట్లను తొలగించకుండా చర్యలు చేపట్టాలని గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ సీఐ సీతారాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. తమ సంఘానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కల్లు పారే తాడిచెట్లను తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గౌడ్లకు జీవనోపాధి కల్పించే తాటి చెట్లను తొలగించొద్దని.. తొలగించిన వారిపై చర్యలు తీసులుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు బాబయ్యగౌడ్, కార్యదర్శి మల్లేష్‌గౌడ్, వెంకటేశ్, బాలరాజు, ధనంజన్, కాటంరాజు, మహేశ్, జంగయ్యలు పాల్గొన్నారు.

అతిథి గృహం.. ఆతిథ్యమిచ్చేదెన్నడో!

- ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరిన గెస్ట్‌హౌస్
- తుప్పపడుతున్న ఫర్నిచర్, పగిలిపోతున్న దర్వాజ, కిటికీలు
- విషసర్పాలు, పక్షులకు ఆవాసంగా కొత్త భవనం
- ప్రజాప్రతినిధులు, అధికారులు మారినా ప్రారంభానికి వీడని గ్రహణం



ప్రారంభానికి నోచుకోని జెడ్పీ అతిథిగృహం (ఇన్‌సెట్లో) శిథిలావస్థకు చేరుకుంటున్న దర్వాజ

యాచారం: ఎనిమిదేళ్ల కాలంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నాలుగో దఫా 2023లో ఓటమి చెందారు. రమావత్ జ్యోతినాయక్, వర్త్యవత్ రజితనాయక్ ఇద్దరు ఎంపీపీలు, ఒక జెడ్పీటీసీ కర్నాటి రమేశ్‌గౌడ్ మారాడు. ప్రస్తుతం పదవిలో ఉన్న ఎంపీపీ కొప్పు సుకన్య, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ పదవి కాలం జూలై 4తో ముగియనుంది. ఇక ఎంపీడీఓలయితే ఐదుగురు మారారు. కాని, యాచారం మండలంలో రూ. 20 లక్షలకు పైగా నిధులతో నిర్మించిన జెడ్పీ అతిథిగృహం మాత్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. జెడ్పీఅతిథి గృహాన్ని ప్రారంభించాలని పలుమార్లు మండల ప్రజలు ఎనిమిదేళ్లుగా ఎంపీపీలకు, జెడ్పీటీసీలకు, ఎంపీడీఓలను ప్రాధేయపడుతున్న వారు మాత్రం శ్రద్ధ పెట్టడం లేదు. దీంతో లక్షల రూపాయాల నిధులతో నిర్మించిన ఆ భవనం నిరుపయోగంగా మారింది. అందులోని ఫర్నిచర్, ఇతర వస్తువులు తుప్పు పట్టిపోతున్నాయి. దర్వాజలు, కిటికీలకు పగుళ్ల ఏర్పడి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఎనిమిదేళ్ల కిందట అప్పటి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై యాచారం మండల కేంద్రంలో జెడ్పీ అతిథిగృహం ఉండాలనే ఉద్దేశంతో నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

విషసర్పాలకు నిలయంగా..

యాచారం మండల పరిషత్ సముదాయ భవనం నిర్మించిన జెడ్పీ అతిథి గృహం ప్రస్తుతం విషసర్పాలకు ఆవాసంగా మారింది. ఈ భవనానికి కిటికీలు లేవు. తలుపులు శిథిలావస్థకు చేరుకుని పెద్ద, పెద్ద రంధ్రాలు పడ్డాయి. భవనం వ్యవసాయ పొలం సమీపంలో, చెట్ల పొదల పక్కన ఉండడంతో విషసర్పాలు చేరాయి.

కిటికీలకు తలుపులు లేకపోవడంతో పక్షులు సైతం లోపలికి వచ్చి గూళ్లు కట్టుకున్నాయి. లక్షల రూపాయాల ప్రజాధనం వృథాగా పోతున్న పట్టించుకునే వారే లేరు. భవనం ప్రారంభిస్తే అతిథులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. మహానగరానికి యాచారం అతి సమీపంలో ఉండడంతో తరుచూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, మంత్రులు, జిల్లా కలెక్టర్లు వస్తుంటారు.

కేవలం రూ. నాలుగైదు లక్షలు ఖర్చు చేస్తే ఈ భవనాన్ని పూర్తిగా వాడుకలోకి తెచ్చే అవకాశం ఉంటుంది. కాని ఆ దిశగా కృషి చేసే వారే లేరు. మరోపది రోజుల్లో ఎంపీపీ, జెడ్పీటీసీలు పదవీ కాలం ముగుస్తుంది. మళ్లీ ఎన్నికలు అయ్యేదెప్పుడో.. కొత్త ఎంపీపీ, జెడ్పీటీసీలు వచ్చేదెప్పుడో.. జెడ్పీ అతిథిగృహం ప్రారంభంఅయ్యేది ఎన్నడో అంటు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారుల, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం జెడ్పీ అతిథిగృహం ప్రారంభానికి శాపంగా మారిందని ప్రజలు అంటున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు...



జెడ్పీ అతిథి గృహాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతుల పనులకు నిధులు మంజూరు చేయాలని కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలోని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని, ప్రస్తుతం ఉన్న ఎంపీపీ సుకన్య, జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మను నిధులు మంజూరు చేయాలని కోరిన స్పందన లేదు.

– ఉస్మాన్, ఏఈఈ పంచాయతీ రాజ్ శాఖ

ప్రజా ప్రభుత్వంలో మహిళలకే ప్రాధాన్యం



అబ్దుల్లాపూర్‌మెట్: కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా పాలనలో మహిళలకే పెద్దపీట వేయాలన్నదే రేవంత్‌రెడ్డి సర్కారు లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డిరంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శివాగార్డెన్స్‌లో శనివారం మండలంలోని 113 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే రంగారెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీ పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడుతారని, రాబోయే రోజుల్లో ప్రతి పథకం అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో దళారీ వ్యవస్థ ఉండేదని విమర్శించారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు, పింఛన్లు, రైతు రుణమాఫీ వంటి పథకాలను ప్రభుత్వం అతి త్వరలోనే అమలు చేయనున్నదని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ దత్తు, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ బుర్ర రేఖా, జెడ్పీటీసీ దాసుగౌడ్, వైస్‌ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న, వైస్‌ఛైర్‌పర్సన్ చామ సంపూర్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సీహెచ్, భాస్కర్‌చారిలతో పాటు ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ఎదుగుదలే లక్ష్యం

ఇబ్రహీంపట్నం: మహిళల ఆర్థిక ఎదుగుదలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ లక్ష్యమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని 92 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్థానిక ప్రజాభవన్(క్యాంపు కార్యాలయం)లో శనివారం ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తుందని, రాబోయో రోజులు మిగతా గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలవుతాయన్నారు. ఈ యేడు పేదలకు 3500 ఇండ్లను నియోజకవర్గంలో నిర్మించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్ పర్సన్ బర్ల మంగ, జెడ్పీటీసీ మహిపాల్, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, మాజీ చైర్మన్ హార్థిక, తహసీల్దార్ సునీత, డీటీ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి, కౌన్సిలర్లు సునీత, మమత తదితరులు పాల్గొన్నారు.

త్వరలో చివరి ఆయకట్టుకు సాగునీరు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆమనగల్లు: కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని డీ 82 కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు మూడు నెలల్లోగా సాగునీరు అందిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. శనివారం ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనుల పురోగతిలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. డీ 82 కాలువ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు రావాల్సిన నష్టపరిహారాన్ని వీలైనంత త్వరలో రైతులకు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కల్వకుర్తి అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించి ప్రత్యేక నిధులను తీసుకువస్తామన్నారు. నియోజకవర్గానికి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ మంజూరు చేశారని దీనికోసం కల్వకుర్తిలో వంద ఎకరాల భూమిని సేకరించనున్నట్లు తెలిపారు. అనంతరం తుర్కలపల్లి, బర్కత్‌పల్లి, సింగంపల్లి గ్రామాల్లో కేఎల్ఐ కాలువ పనులను ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, నాగర్‌కర్నూల్ జిల్లా ఇరిగేషన్ శాఖ ఎస్ఈ ఏఎస్ఎన్‌రెడ్డి, ఈఈ శ్రీకాంత్, డీఈ దేవానంద్, ఏఈలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కామన్ సర్వీస్ సెంటర్స్ ప్రారంభం



మాట్లాడుతున్న ఐసీఎం అధికారి శ్యామ్‌కుమార్

ఇబ్రహీంపట్నం: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించి పలు సేవ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఇండియన్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ అధికారి (ఐసీఎం) శ్యాంకుమార్ పేర్కొన్నారు. కేంద్ర కోఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ వారి సహకారంతో రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ సహకారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సెక్రటరీలకు, రైతులకు దండు మైలారం పీఏసీఎస్‌లో శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాల అభివృద్ధికి చేపడుతున్న సేవలను వివరించారు. సొసైటీల్లో కామన్ సర్వీస్ సెంటర్స్ ఓపెన్ చేసి మీసేవ మాదిరిగా ప్రజలకు సంబంధించిన విద్యుత్ బిల్లులు, గ్యాస్ బుకింగ్‌లు, ఆధార్ కార్డుల మార్పు లు, చేర్పులు తదితర పలు సేవ కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చునన్నారు. అలాగే, సొసైటీలు పెట్రోల్ బంకు, వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. . అదే విధంగా సహకార సంఘ చట్టం, విధి విధానాలు, భవిష్యత్తు ప్రణాళిక, రుణాల రికవరీ, మల్టిసర్వీస్, నాయకత్వ బాధ్యతలపై శ్యాంకుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దండు మైలారం పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సెక్రటరీ ధన్‌రాజ్, డైరెక్టర్ అయ్యప్పరెడ్డి పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే అమ్మకాలు

మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత



కడ్తాల్: ఎరువులను పరిశీలిస్తున్న శ్రీలత

కడ్తాల్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువులు, విత్తనాలు విక్రయించాలని, లేకుంటే సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని, మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీలత హెచ్చరించారు. శనివారం మండలంలోని రావిచేడ్ గ్రామంలో ఎరువుల, విత్తనాల షాపుల్లో వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఆమె తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఎరువుల షాపుల్లో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వ, అమ్మకాలు, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అలాగే, అమ్మకాల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీలత మాట్లాడుతూ.. అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ–పాస్ ద్వారానే విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వందన, డీలర్లు జైపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నిబంధనల ప్రకారమే విక్రయాలు జరపాలి

ఆమనగల్లు: విత్తన, ఎరువుల డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విక్రయించాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి అన్నారు. పట్టణంలోని పలు విత్తన, ఎరువుల డీలర్ల షాపులను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాలలో ఉన్న స్టాక్ నిల్వలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి అరుణకుమారి మాట్లాడుతూ.. విత్తనాల కృత్రిమ కొరతను సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో విత్తనాల నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో డీలర్లు సురేశ్, రవి, చంద్రశేఖర్, జంగయ్య, రాజేశ్ తదితరులు ఉన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు..

ఎంపీటీసీ జ్యోతినాయక్

యాచారం: ఉన్నత లక్ష్యంతో విద్యార్థులు చదువుకోవాలని మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు కొర్ర జ్యోతినాయక్ పేర్కొన్నారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. గ్రామంలో రూ.లక్షల్లో ఫీజులు చెల్లించి ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే స్తోమత లేని పేదలే ఉన్నారని అన్నారు. తల్లిదండ్రులు అప్పులబాధ లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే మీ పిల్లలను చేర్పించాలని కోరారు. పాఠశాలలో తాగునీటి సమస్య, మరుగుదొడ్లు, మూత్రశాలల సమస్య తీర్చడం కోసం అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అరవింద్‌నాయక్, గ్రామస్తులు అఖి ల్,రమేష్, కిషన్, విజేందర్, కిషన్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు

ఎంఈఓ సర్దార్‌నాయక్

ఆమనగల్లు: ప్రభుత్వ ఉపాధ్యాయులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు ఎంఈఓ సర్ధార్‌నాయక్ హెచ్చరించారు. మండలంలోని పలు పాఠశాలలను శనివారం ఆయన తనిఖీ చేశారు. కోనాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి పుస్తకాలు అందాయా.. యూనిఫాంలు అందాయా.. అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాంనుంతలలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించగా ఉపాధ్యాయురాలు స్వాతి విధులకు హాజరు కాకపోవడంతో మెమో జారీ చేస్తామని తెలిపారు. పెద్దతండాలోని ప్రాథమిక పాఠశాల, గేటుతండా ప్రాథమిక పాఠశాలను సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల వివరాలు, విద్యాబోధన గురించి తెలుసుకున్నారు. అలాగే,మండల నోడల్ అధికారిగా నియమితులైన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు లు పాండుకు నియామక ఉత్తర్వులు అందజేశారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్

శ్రీదత్త విద్యాసంస్థల చైర్మన్ పాండు రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శ్రీదత్త విద్యాసంస్థల చైర్మన్ జి. పాండు రంగారెడ్డి అన్నారు. శేరిగూడ బ్రాంచ్‌లో ప్లేస్‌మెంట్ ఎచీవర్స్‌డే, ఇంజనీరింగ్ కోర్సు ముగింపు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు సెకండ్, థర్డ్ ఇయర్‌లోనే వెయ్యి మందికిపైగా ఆన్‌లైన్ సర్టిఫికెట్స్, ఇంటర్నేషనల్ సర్టిఫికేట్స్, పెటెంట్స్‌ను సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థుల ప్రవర్తనతోనే ప్రోటోటైప్ మోడల్స్, మైక్రో, మీని మేజర్ ప్రాజెక్టులకు సంబంధించి పరిశోధన పత్రాలు రూపొందిస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యాసంస్థల వైస్ చైర్మన్ జీఎస్‌వీ విభవ్‌రెడ్డి మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాలకు దీటుగా ఉద్యోగావకాశాలు తమ విద్యాసంస్థలకు దక్కుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ కాగ్నిజెంట్ మల్టీనేషనల్ కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ ఆర్ జితెందర్‌సింగ్, వర్చుసా క్యాంపస్ ఇండియా మేనేజర్ డి. అభిషేక్, ప్రిన్సిపల్స్ డా. ఎస్ వెంకటేశ్వర్లు, డా. సిఃధిల్‌కుమార్, డా. చంద్రశేఖర్, డీన్స్,డా. అచ్యుతరావు, డా. రమేష్, ట్రేనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అశోక్‌కుమార్, వివిధ డిపార్టు మెంట్ల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

ఆలయాల దారి అధ్వానం



పూర్తిగా ధ్వంసమైన రహదారి

భక్తుల రాకపోకలకు ఇక్కట్లు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి శివరామాలయాలకు వెళ్లే రహదారి గోతులుపడి ,కంకర తేలి అధ్వానంగా మారి ప్రయాణికులు, భక్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి మైసిగండి గ్రామ సమీపంలో, శివరామాలయాలు కిలోమీటరు దూరంలో ఉంటాయి. ప్రతినిత్యం శివరామాలయాలను వందలాది మంది భక్తులు తరలివచ్చి దర్శించుకుంటారు. ఇదిలా ఉంటే ఇరవై ఏళ్ల క్రితం శ్రీశైలం– హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి శివ రామాలయాలకు బీటీ రోడ్డు వేశారు. రోడ్డు వేసినప్పటి నుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో, వాహనాల రాకపోకలతో రహదారి పూర్తిగా కంకరతేలి, గోతులు పడి అధ్వానంగా తయరయంది. దీంతో భక్తుల రాకపోకలకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రయాణికుల, భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు శివరామాలయాల రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

సంక్షేమ పథకాల కోసం అర్జీలు పెట్టుకోండి

ఎంపీపీ కొప్పు సుకన్య

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవాకేంద్రాన్ని ఏర్పా టు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ తెలిపారు. గృహజ్యోతి, మహాలక్ష్మి తదితర దరఖాస్తు లు ఈ కేంద్రంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారి సమస్యల పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజాపాలన సేవాకేంద్రం ప్రారంభం

యాచారం: సంక్షేమ పథకాలు అందని అర్హులైన పేదలు మండల కేంద్రంలో ప్రారంభించిన ప్రజాపాలన సేవాకేంద్రంలో అర్జీలు పెట్టుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. మండల పరిషత్ సమావేశం హాల్‌లో శనివారం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుకన్య మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా విద్యుత్ జీరో బిల్లు, గృహలక్ష్మి, పింఛన్లు తదితర సంక్షేమ పథకాలు అందని అర్హులైన పేదలు అర్జీలు పెట్టుకుంటే పరిశీలన చేసి న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. పథకాలు అందజేయాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

ఆమనగల్లు: సంక్షేమ పథకాల కోసం అర్హులైన వారు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ వసంత సూచించారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. వసంత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి, మహాలక్ష్మి పథకం కోసం అర్హులైనప్పటికీ పథకాలు లభించని వారు మున్సిపాలిటీలోని సేవా సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తమ రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యుత్ కనెక్షన్ నంబర్, గ్యాస్ కనెక్షన్ నంబర్, ఎల్‌పీజీ కస్టమర్ ఐడీ, ఫోన్ నంబర్‌తో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



ఆమనగల్లు: సేవా సెంటర్‌ను ప్రారంభించిన కమిషనర్ వసంత